సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శుక్రవారం, 12.06.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 221
పేజీలు: 06 వెల: రూ. 5

# దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

## నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం రేవంత్ స్పష్టీకరణ

### కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనా వివరించిన సీఎం

- విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరం
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడి
- దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులు యంగ్ ఇండియా స్కూల్స్ ను చూడాలనుకున్నా.. సంతోషంగా చూపిస్తాం




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదని నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను నీతి ఆయోగ్ లో ఆయన వివరించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపం చ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండా లని చెప్పారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో పీఎం నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రేవంత్ రెడ్డి మిగతా 02లో

# ప్రకృతి సాగుతో మేలు

## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి



- జమ్మికుంట కేవీకేలో 'ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం'లో కేంద్ర మంత్రి
- రసాయన ఎరువులను వాడకండి
- ఆ పంటలను కొని రోగాలు తెచ్చుకుంటున్నాం
- ముందుగా సేంద్రీయ సాగు చేసే వాళ్లు కోటీశ్వరులు కావొచ్చు

02

# కార్యాలయాలకు శాశ్వత భవనాలు

## రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

02

- తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు నూతన భవనాలు
- హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మాణాలు
- మొదటి దశలో అద్దె, శిథిలావస్థలో ఉన్న 125 కార్యాలయాలకు
- అన్ని భవనాలు ఒకే నమూనాలో నిర్మాణం
- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం



# ఎవరి సద్ది వాళ్లదే..

## రేపు ఒకేసారి 2 వేల స్కూళ్లలో 'టిఫిన్ బైఠక్'



- ఒక్కో స్కూలుకు సగటున 25 మంది హాజరయ్యే అవకాశం
- చిగురుమామిడి మండలం రేకొండలో హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్
- 13న అన్ని స్కూళ్లలో 'స్వచ్ఛ పాఠశాల' పేరుతో క్లీనింగ్
- జమ్మికుంటలో డాక్టర్స్, ప్రముఖులతో కేంద్ర మంత్రి భేటీ

04

# వికసిత్ భారత్ టార్గెట్ 2047

## దేశ సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళికలు




### నీతి ఆయోగ్ సమావేశంలో కీలక చర్చలు, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు


### ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో భేటీ

**ముద్ర డెస్క్:**
న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశం గురువారం ప్రారంభమైంది. దేశంలోని వివిధ రాష్ట్రాల సీఎంలు, లెఫ్టినెంట్ గవర్నర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధన, సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్రాల ప్రాధాన్యతలు, అభివృద్ధి వ్యూహాలపై చర్చలు జరిగాయి. మిగతా 02లో

# టీఆర్ఎస్ టైటిల్ ఫైట్!

## టీఆర్ఎస్ పేరు కోసం మొదలైన కొత్త రాజకీయ పోరు

- పేరును ఎవరికీ కేటాయించొద్దని ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు
- కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేనకు 600కుపైగా అభ్యంతరాలు
- మహారాష్ట్ర పార్టీ కూడా టీఆర్ఎస్ పేరుపై హక్కు కోరుతూ ఈసీని ఆశ్రయించింది
- తెలంగాణ ఉద్యమ వారసత్వానికి ప్రతీకగా టీఆర్ఎస్ పేరు చుట్టూ వివాదం
- పార్టీ పేరు కాదు, ఓటర్ల మనసుల్లో నిలిచిన రాజకీయ బ్రాండ్ టీఆర్ఎస్
- పేరు మారినా ప్రజల్లో ఇప్పటికీ టీఆర్ఎస్‌గానే గుర్తింపు పొందుతున్న బీఆర్ఎస్
- టీఆర్ఎస్ పేరుపై నిర్ణయం తీసుకోవడంలో ఎన్నికల సంఘానికి కీలక సవాల్
- ఒకవైపు వారసత్వ హక్కు.. మరోవైపు కొత్త పార్టీల ఆకాంక్షలు
- టీఆర్ఎస్ పేరు భవితవ్యంపై ఈసీ తీర్పు కోసం ఉత్కంఠ




**ముద్ర డెస్క్ :**
తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ అనే మూడు అక్షరాలు ఇప్పటికీ భావోద్వేగాన్ని, చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఆ పేరును తమకు కేటాయించాలని అనేక పార్టీలు ఎన్నికల సంఘం (ఈసీ) ముందు పోటీ పడుతుండగా, బీఆర్ఎస్ నేతలు ఆ పేరు ఎవరికీ ఇవ్వకూడదని ఫిర్యాదు చేశారు. ఇది కేవలం పేరు వివాదం కాదు. ఇది తెలంగాణ ఉద్యమ వారసత్వం ఎవరి చేతుల్లో ఉండాలి, ఓటర్ల ముందు గుర్తింపు ఎలా ఉండాలి అనే ప్రశ్నను లేవనెత్తుతోంది. 2022లో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకున్నారు. దీంతో టీఆర్ఎస్ ఖాళీగా ఉంది. ఆ పేరు కోసం కొత్త పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇందులో కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని 'తెలంగాణ రక్షణ సేన' ప్రముఖంగా ఉంది. ఆ పార్టీ పేరు ప్రకటనపై 600కి పైగా అభ్యంతరాలు వచ్చాయి.

**అసాధారణ వ్యతిరేకత..**
బీఆర్ఎస్ మద్దతుదారులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాన్య ప్రజల నుంచి ఈసీకి ఫిర్యాదులు మిగతా 02లో

# పాక్ చీటింగ్

## పీవోకే స్వతంత్రం వెనుక చీకటి!




- అధ్యక్షుడు ఉన్నా.. అసలు అధికారం ఇస్లామాబాద్ చేతుల్లోనే!
- స్వతంత్రం ముసుగులో పాక్ నియంత్రణ.. పీవోకే అసలు కథ ఇదే!
- జెండా, ప్రభుత్వం, శాసనసభ ఉన్నా.. నిర్ణయాలన్నీ పాకిస్తాన్‌వే!
- కరాచీ ఒప్పందం నుంచి రిమోట్ కంట్రోల్ పాలన వరకు.. పీవోకే వాస్తవం!
- విధేయత ప్రమాణంతోనే రాజకీయాలు.. పీవోకేలో భిన్న స్వరాలకు తాళం!

02

# నేపాలీ ముఠా సభ్యుల అరెస్ట్




- గచ్చిబౌలి హిల్ రిడ్జ్ విల్లాస్‌లో భారీ చోరీ కేసు ఛేదన
- సుమారు 7.8 కిలోల బంగారం, వెండి వస్తువులు స్వాధీనం
- మీడియా సమావేశంలో సైబరాబాద్ సీపీ రమేశ్ రెడ్డి

03

# నిధులివ్వండి..

## అభివృద్ధికి సహకరించండి

## మోదీతో రేవంత్ కీలక భేటీ..

- తెలంగాణ అంశాలపై ప్రత్యేక చర్చ
- నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ప్రధాని-సీఎం ముఖాముఖి
- రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర నిధులపై ప్రధానితో రేవంత్ చర్చ
- పెండింగ్ ప్రాజెక్టులు, మౌలిక వసతుల విస్తరణకు సహకారం కోరిన సీఎం
- విభజన హామీలు, జాతీయ ప్రాజెక్టులపై ప్రస్తావన
- తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి సానుకూల స్పందన ఆశిస్తున్న ప్రభుత్వం

02



# రికవరీ

## పోలీసులకు సవాల్‌గా మారిన పీఎంజే కేసు!




- 40 రోజులైనా దొరకని దోపిడీ సొత్తు
- సుబోధ్‌సింగ్ విచారణలో కొత్త ట్విస్ట్
- పీఎంజే కేసు పోలీసులకు తలనొప్పి
- విరుద్ధ వాదనలతో దర్యాప్తు క్లిష్టం
- సొత్తు రికవరీపై ఉత్కంఠ

02

*దోపిడీ జరిగి 40 రోజులు.. నిందితుల నోట విరుద్ధ వాదనలు.. పీఎంజే జ్యువెలరీ కేసులో పోలీసుల ముక్కు తాళ్లు తెంచుతున్న గ్యాంగ్‌స్టర్ సుబోధ్ సింగ్ వ్యూహం.. సాధారణ దొంగతనాల్లో కొద్ది రోజుల్లోనే సొత్తు రికవరీ చేసే పోలీసులకు, పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసు మాత్రం చుక్కలు చూపిస్తోంది. ప్రధాన సూత్రధారి గ్యాంగ్‌స్టర్ సుబోధ్ సింగ్‌తో పాటు మిగతా నిందితులు విచారణలో ఒకరికొకరు పొంతన లేని సమాధానాలు ఇస్తూ దర్యాప్తును పక్కదారి పట్టిస్తున్నారు. పక్కా ప్లాన్‌తో సొత్తును వేరే రాష్ట్రాలకు తరలించారా? లేక కరిగించేశారా? అన్న కోణంలో పోలీసులు సతమతమవుతుండగా.. ఈ హైటెక్ దోపిడీని ఛేదించేందుకు ఇప్పుడు సైంటిఫిక్ ఫోరెన్సిక్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీయే శరణ్యంగా మారింది.*

### ఇదీ AI ముద్ర



## మేధో సామర్థ్యానికి వ్యాయామం చేయండి



రోజువారీ శారీరక శ్రమ గుండె సామర్థ్యాన్ని పెంచి, మెదడుకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఇది వయసుతో పాటు వచ్చే విషయగ్రహణ సామర్థ్య క్షీణతను, ఆలోచనల గందరగోళాన్ని సమర్థంగా నిలువరిస్తుంది.

# పాక్ చీటింగ్ గేమ్..

**ముద్ర డెస్క్:**
పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) గురించి చాలా మందికి ఒక ప్రశ్న తరచూ వస్తుంది. అక్కడ ప్రత్యేక అధ్యక్షుడు, ప్రధానమంత్రి, శాసనసభ, న్యాయవ్యవస్థ, మంత్రివర్గం, జెండా, తాత్కాలిక రాజ్యాంగం ఎందుకు ఉన్నాయి? ఇవి నిజంగా స్వయం ప్రతిపత్తిని సూచిస్తాయా? లేదా ఇవి కేవలం బాహ్య ప్రదర్శన మాత్రమేనా? ఈ ప్రశ్నలు ఇటీవలి ఆందోళనల నేపథ్యంలో స్పష్టంగా ఎదురవుతున్నాయి.

**అధికారికంగానే పేరు..**
పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని ''ఆజాద్ జమ్మూ అండ్ కశ్మీర్'' అని అధికారికంగా సంబోధిస్తుంది. ఇక్కడ అధ్యక్షుడు రాజ్యాంగపరమైన అధిపతిగా, ప్రధానమంత్రి కార్యనిర్వాహక అధిపతిగా వ్యవహరిస్తారని చెబుతారు. శాసనసభ, న్యాయస్థానాలు, మంత్రిమండలి, ప్రత్యేక జెండా వంటి నిర్మాణాలు ఉన్నాయి. బయటి నుంచి చూస్తే ఇది స్వతంత్రంగా లేదా స్వయం నిర్ణయాధికారంతో నడిచే ప్రాంతంలా కనిపిస్తుంది.

**భారత్‌లో విలీనం..**
1947లో భారత విభజన తర్వాత జమ్మూ కశ్మీర్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. దీంతో జరిగిన మొదటి యుద్ధం ముగిసే సమయానికి కొంత భూభాగం పాకిస్తాన్ నియంత్రణలో మిగిలింది. పాకిస్తాన్ ఆ ప్రాంతాన్ని తన సాధారణ ప్రావిన్సుల్లో కలపలేదు. మొత్తం కశ్మీర్‌పై తన హక్కును అంతర్జాతీయంగా కొనసాగించాలని అనుకుంది. అందుకే ఆ ప్రాంతాన్ని ప్రత్యేకంగా చూపించే విధానాన్ని అనుసరించింది.

**కరాచీ ఒప్పందం...**
1949లో కరాచీ ఒప్పందం ద్వారా రక్షణ, విదేశాంగ విధానం, సమాచార వ్యవస్థలు వంటి కీలక అధికారాలను పాకిస్తాన్ తన వద్దే ఉంచుకుంది. 1974లో తాత్కాలిక రాజ్యాంగం అమల్లోకి తెచ్చి అధ్యక్షుడు, ప్రధానమంత్రి, శాసనసభ వంటి సంస్థలను ఏర్పాటు చేసింది. అయితే ఈ రాజ్యాంగం ప్రకారం కూడా ప్రధాన నిర్ణయాలు ఇస్లామాబాద్ అనుమతితోనే తీసుకోవాలి. వాస్తవ పరిపాలన, నియంత్రణ స్వరూపంరక్షణ, విదేశాంగం, ఆర్థిక విధానాలు, వ్యూహాత్మక విషయాలు అన్నీ పాకిస్థాన్ కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. పీవోకే పరిపాలనలో పాకిస్తాన్ నుంచి పంపిన అధికారులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. శాసనసభలో కొన్ని స్థానాలు పాకిస్తాన్‌లో ఉన్న కశ్మీరీ శరణార్థుల కోసం రిజర్వ్ చేయబడ్డాయి. ఇది స్థానిక రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తుంది.

**విధేయతే ప్రమాణం..**
శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే నాయకులు, న్యాయమూర్తులు, రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు కశ్మీర్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేయాలనే వాదనకు మద్దతు ఇస్తామని తప్పనిసరిగా ప్రమాణం చేయాలి. దీంతో భిన్న అభిప్రాయాలు, ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనలకు అవకాశం చాలా తక్కువగా ఉంటుంది.

**భారత్ స్థిరమైన వైఖరి..**
భారత్ ఈ మొత్తం ప్రాంతం తన అంతర్భాగమని, 1947 నుంచి పాకిస్తాన్ అక్రమ ఆక్రమణలో ఉందని స్పష్టంగా పేర్కొంటుంది. స్థానిక సంస్థలు ఉన్నప్పటికీ అవి నిజమైన స్వతంత్రతను సూచించవని, అవి పాకిస్తాన్ నియంత్రణలోనే పనిచేస్తున్నాయని భారత్ అభిప్రాయం. ఈ వ్యవస్థలు ప్రపంచానికి స్వయం ప్రతిపత్తి చూపించడానికి సృష్టించినవని భారత్ వాదిస్తుంది.
బయటికి కనిపించే అధ్యక్షుడు, ప్రధానమంత్రి, శాసనసభ వంటి నిర్మాణాలు ఉన్నప్పటికీ, రక్షణ, విదేశాంగం, కీలక నిర్ణయాలు అన్నీ ఇస్లామాబాద్‌లోనే తీసుకోబడుతున్నాయి. ఈ వ్యవస్థ మొత్తం పాకిస్తాన్ రిమోట్ కంట్రోల్‌లోనే నడుస్తుంది.




# టీఆర్ఎస్ టైటిల్ ఫైట్!

**(మొదటి పేజీ తరువాయి)**
వచ్చాయి. దీంతో కవిత పార్టీ నేతలు త్వరలో ఎన్నికల సంఘాన్ని నేరుగా కలిసి తమ వాదనను వినిపించనున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' కూడా టీఆర్ఎస్ పేరును తమకు కేటాయించాలని ఈసీని ఆశ్రయించింది. తెలంగాణ బయటి నుంచి వచ్చిన ఈ ప్రయత్నం, టీఆర్ఎస్ పేరు కేవలం తెలంగాణలోనే కాకుండా, సరిహద్దు ప్రాంతాల్లోని తెలుగు మాట్లాడే ప్రజల్లో కూడా గుర్తింపు కలిగి ఉందని చెబుతోంది.

**పేరు ఎందుకు ఇంత ప్రాముఖ్యత..**
భారతీయ రాజకీయాల్లో పార్టీ పేరు కేవలం ఒక లేబుల్ కాదు. అది ఓటర్ల మనసుల్లో నిలిచిపోయిన బ్రాండ్. టీఆర్ఎస్ పేరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంతో ముడిపడి ఉంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలకు ఇది గౌరవం, గుర్తు. కొత్త పార్టీ ఆ పేరును ఉపయోగించుకుంటే, ఓటర్లు సులభంగా ఆకర్షితులవుతారు. అదే సమయంలో, బీఆర్ఎస్ తన పాత పేరును రక్షించుకోవాలనుకుంటోంది. పేరు మార్చుకున్న తర్వాత కూడా, ప్రజలు ఇంకా బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తున్నారు.

**ఈసీ ముందు సవాళ్లు**
ఎన్నికల సంఘం ఈ వివాదంలో కీలక పాత్ర పోషించాలి. పార్టీల నమోదు నిబంధనల ప్రకారం, ఇప్పటికే ఉన్న పార్టీ పేరుకు సమీపంలో ఉన్న పేర్లను అనుమతించకూడదు. ఆఖ ఫిర్యాదు, కవిత పార్టీపై వచ్చిన వందలాది అభ్యంతరాలు, మహారాష్ట్ర పార్టీ కోరిక ఇవన్నీ ఈసీ ముందు ఉన్నాయి. ఈసీ ఒకవేళ కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు ఇస్తే, బీఆర్ఎస్ మద్దతుదారుల్లో అసంతృప్తి పెరగవచ్చు. ఒకవేళ నిరాకరిస్తే, కొత్త పార్టీలు ''వారసత్వం అడ్డుకుంటున్నారు'' అనే ఆరోపణలు చేయవచ్చు. రెండు వైపులా రాజకీయ లాభనష్టాలు ఉన్నాయి. అందుకే ఈసీ త్వరగా, పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలి. అన్ని పార్టీలను పిలిచి విన్నపాలు విని, స్పష్టమైన కారణాలతో తీర్పు ఇవ్వాలి.
ఎన్నికల సంఘం న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే, ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో మరింత పరిపక్వతను తీసుకురావచ్చు. లేకపోతే, ఇది మరిన్ని గందరగోళాలకు దారితీసే ప్రమాదం ఉంది. టీఆర్ఎస్ పేరు ఎవరిది అనేది న్యాయస్థానాలు లేదా ఎన్నికల సంఘం నిర్ణయించాలి. కానీ ఆ పేరు వెనుక ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశలు ఎవరూ దోచుకోకూడదు. అది మాత్రం తెలంగాణ ప్రజలే నిర్ణయించాలి.

# దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

**(మొదటి పేజీ తరువాయి)**
మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధేనని గుర్తు చేశారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (SEEEPC)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు.
తెలంగాణలో విద్యా–నైపుణ్యాభివృద్ధి విప్లవం విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. గడచిన 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం నిర్మించే యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా.. అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్ ఇండియా స్కూల్స్ చూడాలంటే తాము సంతోషంగా చూపిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు. ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చే యడం తొలి విజయమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం–6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. ఒక్కో నగరానికి రూ.1 లక్ష కోటి చొప్పున మౌలిక వసతుల అభివృద్ధికి అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రకృతి సాగుతో మేలు

**ముద్ర, కరీంనగర్:**
రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన "ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం"లో ఆయన పాల్గొని మాట్లాడారు.
రసాయన ఎరువులతో పండించే ఆహార పదార్థాలను తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు భవిష్యత్తులో మంచి డిమాండ్‌తో పాటు అధిక ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా దేశవ్యాప్తంగా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను సేంద్రీయ సాగు వైపు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.
ప్రతి సంవత్సరం ఎరువుల సబ్సిడీ కోసం భారీ మొత్తంలో నిధులు ఖర్చవుతున్నాయని, విదేశాల నుంచి యూరియా దిగుమతులపై లక్షల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు లాభం కలగడమే కాకుండా దేశ సంపద విదేశాలకు వెళ్లకుండా కాపాడవచ్చని అన్నారు.
సేంద్రీయ పంటలకు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని, రైతులు ఆరోగ్యకరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని బండి సంజయ్ సూచించారు.

# కార్యాలయాలకు శాశ్వత భవనాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన, గౌరవప్రదమైన సేవలు అందించేందుకు తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.
మొదటి దశలో అద్దె భవనాల్లో లేదా శిథిలావస్థలో కొనసాగుతున్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనాలు నిర్మించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాలను ఒకే నమూనాలో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు.
అలాగే స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కూడా సమీకృత భవనాల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. హైదరాబాద్ పరిసర జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక భవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# రికవ'రీ'

**ముద్ర , కరీంనగర్ :**
కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌పై జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఘటన జరిగి దాదాపు 40 రోజులు అయినా చోరీ అయిన వజ్రాలు, బంగారు ఆభరణాల ఆచూకీ ఇప్పటికీ పూర్తిగా లభ్యం కాలేదు. సాధారణ దోపిడీ కేసుల్లో కొద్ది రోజుల్లోనే సొత్తు రికవరీ అయ్యేవి, కానీ ఈ కేసు పూర్తి వ్యతిరేక దిశలో సాగుతోంది.

**గ్యాంగ్‌స్టర్ సుబోధ్ సింగ్ అరెస్ట్..**
ఈ దోపిడీ కేసులో కీలక నిందితుడిగా పోలీసులు గ్యాంగ్‌స్టర్ సుబోద్ సింగ్ అని గుర్తించారు. ఇటీవలే అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు ఇతర నిందితులు కూడా విచారణలో పరస్పరం విరుద్ధమైన వాదనలు చెబుతున్నారు. ఒకరు ఒక విషయం చెప్పగా, మరొకరు దానికి పూర్తి వ్యతిరేకంగా సమాధానాలు ఇవ్వడం పోలీసులను తీవ్ర గందరగోళంలో పడేస్తోంది. ఈ విరుద్ధ సమాధానాలు సహజమైనవా లేదా నిందితులు కావాలని పోలీసులను తప్పుదారి పట్టించడానికి చేస్తున్న వ్యూహాత్మక ప్రయత్నమా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. గ్యాంగ్‌స్టర్ నేతృత్వంలోని ఈ బృందం ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధమై ఉండవచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.

**క్లిష్టంగా మారిన దర్యాప్తు..**
పీఎంజే కేసు దర్యాప్తు సాధారణ దొంగతనం కంటే చాలా క్లిష్టంగా మారింది. దోపిడీ జరిగిన వెంటనే సొత్తును వేర్వేరు చోట్లకు తరలించినట్లు పోలీసులు భావిస్తున్నారు. తర్వాత ఆభరణాలను కరిగించి వేరే రూపంలో మార్చడం లేదా ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపించడం జరిగి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిందితుల మధ్య ఉన్న విరుద్ధ వాదనలు నిజమైన సమాచారాన్ని బయట పెట్టడం లేదు. సైంటిఫిక్ ఫోరెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లోతైన విశ్లేషణ, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ వంటి అధునాతన పద్ధతులు తప్పనిసరి అవుతున్నాయి.

**పోలీసులకు సవాల్..**
ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. సుబోధ్ సింగ్ ఇప్పటికే అనేక ఇతర కేసుల్లో ప్రమేయం ఉన్న గ్యాంగ్‌స్టర్ కావడంతో దోపిడీ వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇప్పుడు కేవలం నిందితుల వాదనలపైనే ఆధారపడకుండా మరింత లోతైన విచారణ జరపాల్సి ఉంది. సొత్తు రికవరీలో ఆలస్యం జరిగితే నేరస్తులకు ధైర్యం పెరిగి, భారీ దోపిడీలు పెరిగే ప్రమాదం ఉంది.
పోలీసులు ఈ విరుద్ధ సమాచారాలను అధిగమించి, నిజమైన సొత్తు ఆచూకీని త్వరగా గుర్తించి రికవరీ చేయగలరా అనేదే ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం. దర్యాప్తు ఎంత సమర్థవంతంగా, ఎంత త్వరగా ముగుస్తుందో అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.




## వికసిత్ భారత్ టార్గెట్ 2047




**(మొదటి పేజీ తరువాయి)**
వెనుకబడిన జిల్లాల అభివృద్ధి, పీఎం ధనధాన్య కృషి యోజన అమలు, విద్యా రంగంలో సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య, క్రీడల ప్రోత్సాహం వంటి అంశాలపై నీతి ఆయోగ్ ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇవ్వనుంది. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి,. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ నూతనంగా ఎన్నికైన ముఖ్యమంత్రులు బెంగాల్ సువేందు అధికారి, తమిళనాడు సి. జోసెఫ్ విజయ్, కర్ణాటక డి.కె. శివకుమార్, వీడీ సతీశన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.




# నిధులివ్వండి..

**ముద్ర, న్యూఢిల్లీ:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన అనంతరం జరిగిన ఈ భేటీ రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సుమారు కొంతసేపు కొనసాగిన ఈ సమావేశంలో తెలంగాణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, కేంద్ర నిధుల కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాష్ట్రానికి సంబంధించిన జాతీయ రహదారుల అభివృద్ధి, రైల్వే ప్రాజెక్టులు, సాగునీటి పథకాలు, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం వంటి అంశాలపై సీఎం రేవంత్ ప్రధానితో మాట్లాడినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే తెలంగాణకు రావాల్సిన కేంద్ర నిధుల విడుదల, విభజన హామీల అమలు, విద్యా మరియు వైద్య రంగాలకు సంబంధించిన కేంద్ర సహకారం అంశాలను కూడా సీఎం ప్రస్తావించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం మరింత సహకారం అందించాలని రేవంత్ రెడ్డి కోరినట్లు తెలుస్తోంది.
ఈ భేటీ రాజకీయంగా కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటీవల కేంద్ర–రాష్ట్ర సంబంధాలు, అభివృద్ధి అంశాలపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఈ సమావేశం ఆసక్తికరంగా మారింది. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్రం నుంచి సానుకూల స్పందన లభిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వంతో తమ రాష్ట్రాల అవసరాలను చర్చించారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రేవంత్ రెడ్డి జరిపిన ప్రత్యేక భేటీ తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతమివ్వొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## మేధో సామర్థ్యానికి కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోండి

వ్యాయామం చేసినప్పుడు కాలేయం నుండి 'జీపీఎల్డీ1' అనే మేలు చేసే ఎక్సర్‌కైన్ అణువు విడుదలవుతుంది. ఇది వృద్ధాప్యంలో కూడా చిన్నపిల్లల మాదిరిగా జ్ఞాపకశక్తి చురుగ్గా ఉండేలా సహాయపడుతుంది.



# జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే లక్ష్యం

**- జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ**



ముద్ర, నారాయణపేట: నారాయణపేట జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఎప్పుడూ ముందుంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు కోయిలకొండ నారాయణరెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలలో ఒకరికి ఉచితం, మరొకరికి ఫీజులో 50 శాతం ప్రైవేటు పాఠశాలల్లో రాయితీ ఉంటుందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా సర్క్యులర్ జారీ చేయాలని టి యు డబ్ల్యూజే పక్షాన జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందురాజులుకు వినతి పత్రం అందించారు. ఇందుకుగాను డీఈవో స్పందిస్తూ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్ ను జారీ చేశారు. ఈ నిర్ణయంపై జిల్లాలోని జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కే. నారాయణ రెడ్డి మాట్లాడుతూ తమ యూనియన్ పనితీరు చేతల్లో ఉంటుందన్నారు. తమ యూనియన్ లో ఉంటూ ఇతర యూనియన్లకు వత్తాసు పలికే వారికి కూడా తాము ఆపదలో ఎల్లప్పుడూ అండగానే నిలిచామన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన నారాయణపేట జిల్లా జర్నలిస్టుల సంక్షేమమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. జర్నలిస్టు పిల్లల సర్కులర్ జారీ కోసం తమ యూనియన్ హెల్త్ కన్వీనర్ ఆకుల రాజేష్ పనితీరును మరోసారి ప్రశంసించారు. ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యులు నక్క శ్రీనివాస్, రాష్ట్ర డిజిటల్ మీడియా సభ్యులు రఘు గణప, ప్రచార కార్యదర్శి సులిగేం సురేష్, జర్నలిస్టు నాయకులు పోర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ చోరీ కేసు ఛేదన.. 7.8 కిలోల బంగారం స్వాధీనం

**- నేపాలీ ముఠా సభ్యుల అరెస్ట్**










ముద్ర, శేరిలింగంపల్లి: గచ్చిబౌలి హిల్ రిడ్జ్ విల్లాస్‌లో జరిగిన భారీ చోరీ కేసును సైబరాబాద్ పోలీసులు వేగంగా ఛేదించి, నేపాలీ ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 7.837 కిలోల బంగారు ఆభరణాలు, 1.361 కిలోల వెండి వస్తువులు, రూ.33,170 నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.


జూన్ 6న విల్లా యజమానులు ఇంట్లో లేని సమయంలో నేపాలీ దంపతులు చోరీకి పాల్పడగా, మరుసటి రోజు ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు లాకర్‌లోని బంగారం, వెండి వస్తువులు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాయి.

దర్యాప్తులో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లా వద్ద కమల్ షాహీ, విమ్లా షాహీ అలియాస్ బిమలా షాహీ, కల్పనా షాహీలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు విలాసవంతమైన ఇళ్లలో గృహ సేవకుల ద్వారా సమాచారం సేకరించి, యజమానులు లేని సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసును త్వరితగతిన ఛేదించి మొత్తం ఆస్తిని రికవరీ చేసిన పోలీసు బృందాన్ని సీపీ అభినందిస్తూ నగదు బహుమతులు ప్రకటించారు.

### తహసీల్దార్ల పదోన్నతులు, పోస్టింగులపై

# విజిలెన్స్ విచారణ జరపాలి

**- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్**



ముద్ర, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో తహసీల్దార్లకు ఇటీవల కల్పించిన తాత్కాలిక పదోన్నతులు, పోస్టింగుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. జి.ఓ. ఆర్.టి. నెం. 298 (27-05-2026) ద్వారా 12 మంది తహసీల్దార్లను ఆర్‌డీఓలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని పేర్కొంది. విజిలెన్స్, ఏసీబీ కేసులు ఎదుర్కొంటున్న కొందరికి కూడా కోర్టు ఉత్తర్వులను తప్పుగా అర్థం చేసుకుని పదోన్నతులు ఇచ్చినట్లు ఎఫ్‌జీజీ ఆరోపించింది. అలాగే పదోన్నతి పొందిన 12 మందిలో 7 మందికి నేరుగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) పోస్టింగులు ఇవ్వడం హైరార్కీకి విరుద్ధమని తెలిపింది. ఏసీబీ ట్రాప్ కేసు ఎదుర్కొంటున్న ఒక తహసీల్దార్‌కు కూడా పదోన్నతి కల్పించినట్లు పేర్కొంటూ, గత కొన్ని నెలల్లో ఇచ్చిన అన్ని తాత్కాలిక పదోన్నతులు, పోస్టింగులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని ఎఫ్ జీజీ అధ్యక్షుడు ఎం. పద్మనాభ రెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు పదోన్నతులు, పోస్టింగులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఉప్పల్ భగాయత్ లేఅవుట్ పై లోకాయుక్త నిజనిర్ధారణ కమిషన్

ముద్ర కాప్రా: ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఅవుట్‌లో ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యలపై దాఖలైన ఫిర్యాదుల నేపథ్యంలో లోకాయుక్త కోర్టు నిజనిర్ధారణ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ మహేందర్ లేఅవుట్‌ను పరిశీలించారు. హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి అధికారులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాల వంటి సమస్యలను నిశితంగా పరిశీలించారు. పరిశీలన అనంతరం పూర్తి నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మధుసూదన్ రెడ్డి, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ అధికారులు పాల్గొన్నారు.

# భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

### గంటల్లోనే కేసు ఛేదించిన మల్కాజిగిరి పోలీసులు



ముద్ర, మల్కాజిగిరి

మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి దేశీయ తయారీ పిస్టల్, బుల్లెట్లు, కత్తులు సహా పలు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

మల్కాజిగిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్ తెలిపిన ప్రకారం.. మారుతీనగర్‌కు చెందిన ధమరా అరుణ్ కుమార్ (48) తన భార్య నిషారాణి (35)పై అనుమానాలు పెంచుకొని తరచూ వేధించేవాడు. దాంపత్య కలహాలు తీవ్రరూపం దాల్చడంతో జూన్ 10 తెల్లవారుజామున ఇంట్లోనే పిస్టల్‌తో కాల్పులు జరిపి ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది.

ఫిర్యాదు అందుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో వేగంగా దర్యాప్తు చేపట్టి జూన్ 11న మౌలాలి రైల్వే స్టేషన్ సమీపంలో అరుణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు హరిందర్ సింగ్ పరారీలో ఉండగా, మిర్ ముజమ్మిల్ అలీ ఖాన్‌ను కూడా కేసులో నిందితుడిగా చేర్చినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి వద్ద నుంచి ఒక దేశీయ పిస్టల్, మూడు బుల్లెట్లు, మూడు కత్తులు, శస్త్ర చికిత్స బ్లేడ్, ఒక మారుతి బలెనో కారు, బజాజ్ చేతక్ స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి అభినందించారు. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్రకు విశేష స్పందన



ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ మల్లు రవి చేపట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదిక బస్సు యాత్రకు తిమ్మాజిపేట, తాడూరు మండలాల్లో ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగిన యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ప్రారంభమైన ఈ బస్సు యాత్ర తిమ్మాజిపేట మండల కేంద్రానికి చేరుకోగా, ప్రజలు ప్రచార రథానికి ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే యాత్ర ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయాల్లోకి పదవుల కోసం కాకుండా ప్రజా సేవ కోసం వచ్చానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత సన్న బియ్యం పంపిణీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తిమ్మాజిపేట, తాడూరు మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జేఎన్టీయూ వీసీని వెంటనే తొలగించాలి



**- స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం**

ముద్ర, కూకట్ పల్లి: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) వైస్ ఛాన్సలర్ టీకేకే రెడ్డిని వెంటనే పదవి నుంచి తొలగించాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం వీసీ కార్యాలయం ఎదుట ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు జవ్వాజి దిలీప్, రాహుల్ నాయక్ మాట్లాడుతూ, వీసీ విద్యార్థులకు అందుబాటులో లేకపోవడంతో పాటు అధికారులు, భద్రతా సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఐడీ కార్డులు ఉన్న విద్యార్థులను కూడా విశ్వవిద్యాలయంలోకి అనుమతించకుండా మౌఖిక ఆదేశాలు జారీ చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దళిత, గిరిజన విద్యార్థుల పట్ల వివక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ, విద్యార్థులను కలవకుండా సెక్యూరిటీ సిబ్బందిపై దురుసుగా వ్యవహరించడం వీసీ హోదాకు తగదన్నారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోలేని పరిస్థితిలో ఉంటే వీసీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి టీకేకే రెడ్డిని వీసీ పదవి నుంచి తొలగించి, విద్యార్థుల పట్ల గౌరవప్రదంగా వ్యవహరించే సమర్థుడైన వ్యక్తిని నియమించాలని ఫోరం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సాగర్ నాయక్, దుర్గాప్రసాద్, సుజయ్, శ్రీనికేతన్, ఆనంద్, ఆదిత్య, చక్రవర్తి, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

ముద్ర, నాగర్ కర్నూల్: ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన సంక్షేమ సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడకూడదని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కల్వకుర్తి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్, నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించి పనుల స్థితిగతులను పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి ప్రాజెక్టు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తవాలని, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలను అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. క్యాటిల్ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ రైతులు, వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు.

# వీసా కార్డుదారులకు భారీ ప్రయోజనాలు..

**- కొత్త వ్యాల్యూ ప్రపోజిషన్ ప్రారంభం**




ముద్ర, హైదరాబాద్: ప్రపంచ ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ వీసా భారతదేశంలో తన ప్లాటినం మరియు క్లాసిక్ కన్స్యూమర్ క్రెడిట్, డెబిట్ కార్డుల కోసం మెరుగైన వ్యాల్యూ ప్రపోజిషన్‌ను ప్రకటించింది. ఈ కొత్త ఆఫర్ ద్వారా కార్డుదారులు రోజువారీ ఖర్చులపై ప్రత్యేక రాయితీలు, సులభమైన రిడెంప్షన్ అవకాశాలు మరియు విస్తృతమైన మర్చంట్ నెట్‌వర్క్ ప్రయోజనాలను పొందనున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 29 కోట్లకు పైగా కార్డుదారులు లబ్ధి పొందే అవకాశం ఉంది. ఫుడ్, ఈ-కామర్స్, ఓటీటీ, ట్రావెల్, రిటైల్ వంటి విభాగాల్లో స్విగ్గీ, జెప్టో, మీషో, సోనీలివ్, జీ5, లైఫ్‌స్టైల్, షాపర్స్ స్టాప్ తదితర ప్రముఖ బ్రాండ్లతో వీసా భాగస్వామ్యం కుదుర్చుకుంది.

అర్హులైన కొత్త క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు ₹250 వరకు వెల్‌కమ్ వోచర్‌తో పాటు ఎంపిక చేసిన అంతర్జాతీయ విమానాశ్రయ లాంజ్‌లలో ఉచిత ప్రవేశ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది. వినియోగదారుల రోజువారీ ఖర్చులకు మరింత విలువను అందించడమే ఈ కొత్త ఆఫర్ లక్ష్యమని వీసా ప్రతినిధులు తెలిపారు.

# చిన్నారుల మరణాలను అరికట్టాలి: డీఎంహెచ్ వో కృష్ణ

ముద్ర, నాగర్ కర్నూల్: ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలను తగ్గించేందుకు డయేరియా నియంత్రణ, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం, ఉద్ధృత పల్స్ పోలియో కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆశా నోడల్ పర్సన్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల్లో సుమారు 17 శాతం డయేరియా కారణంగానే సంభవిస్తున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి వాటి వినియోగంపై తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 16 నుంచి జూలై 31 వరకు ప్రత్యేక డయేరియా నియంత్రణ ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అలాగే జూన్ 28, 29, 30 తేదీల్లో నిర్వహించే ఉద్ధృత పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని, ముఖ్యంగా వలస కుటుంబాల చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

జూలై 13న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరు కాలేని వారికి జూలై 20న ప్రత్యేకంగా మాత్రలు అందజేస్తామని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా నోడల్ పర్సన్లు పాల్గొన్నారు.

# విశ్వాసం అభివృద్ధి ప్రజా సంక్షేమమే ధ్యేయం

**- బీజేపీ నేత రవికుమార్ యాదవ్**

ముద్ర, శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమ పథకాలు, సంస్కరణలు, అభివృద్ధి పనులు, వ్యాపార, విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు అండగా నిలిచిన ఘనత బిజెపి కేంద్ర ప్రభుత్వానిది, ప్రధాని నరేంద్ర మోదీదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ కొనియాడారు. ప్రధాని మోదీ సుసంపన్న పాలన 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శేరిలింగంపల్లి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హఫీజ్ పేట్ బి.ఎల్. వై హోమ్స్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడారు. ఈ సమావేశంలో బల్ల అశోక్, రవీందర్ రావు, ప్రభాకర్ యాదవ్,రాఘవేంద్రరావు, బుచ్చిరెడ్డి, అనిల్ గౌడ్, అజిత్ కుమార్, మహేష్ యాదవ్, జితేందర్, పద్మ, సింధు రెడ్డి, కాంచన కృష్ణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 12.06.2026
www.mudranews.in | @mudranews



## మేధో సామర్థ్యానికి..

బ్లడ్-బ్రెయిన్ బ్యారియర్‌ను రక్షించుకోండి. మెదడు రక్షణ పొరను బలహీనపరిచే విషతుల్య ప్రొటీన్లను (TNAP) వ్యాయామం ద్వారా ఉత్పత్తి అయ్యే అణువులు విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా మెదడులోకి హానికారకాలు ప్రవేశించకుండా, అల్జీమర్స్ వంటి వ్యాధులు రాకుండా రక్షణ లభిస్తుంది.



## ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీలో దేవ్‌జీ ప్రతిభ



**ముద్ర, కోరుట్ల:** ఇటీవల జరిగిన సప్లమెంటరీ ఎగ్జామ్ లో మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ పరీక్షలు రాసి తన ప్రతిభను చాటారు. 72 మార్కులతో పాసయ్యారు. దీంతో ఇంటర్మీడియట్ లో మొత్తం 614 మార్కులు సాధించారు. 42 ఏళ్ల క్రితం ఇంటర్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్ట్ తప్పిన దేవ్ జీ ప్రత్యేక అనుమతితో ఇంటర్ పరీక్షను రాశారు. అంతేకాకుండా ఇటీవల జరిగిన ఓపెన్ సెట్ రాసిన దేవ్ జీ 349 ర్యాంకు సాధించారు. ఐదేళ్ల న్యాయవిద్య అభ్యసించేందుకు దేవ్ జీ అర్హత సాధించారు.

## ఆలయ అభివృద్ధికి భూదానం



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల మండలం ధర్మారం గ్రామానికి చెందిన ప్రముఖ రైతు న్యాత గంగారం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ.15 లక్షల విలువైన తన సొంత 10 గుంటల భూమిని ఉచితంగా దానం చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక అభివృద్ధి, ఆలయ విస్తరణ, భక్తుల సౌకర్యాల కోసం చేసిన ఈ గొప్ప దాతృత్వాన్ని గ్రామ ప్రజలు హర్షిస్తూ, న్యాత గంగారాం ను అభినందించి శాలువాతో సత్కరించారు.

## మేలకుంట శిఖం భూమిని కబ్జా నుండి కాపాడండి

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ లోని సీతారాంపూర్ శివారులో గల 'మేలకుంట శిఖం' ప్రభుత్వ భూమిని అక్రమ కబ్జాల నుండి కాపాడి, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూతప్పుడు పత్రాలతో మున్సిపాలిటీ నుండి అనుమతులు పొంది ప్రైవేట్ భవనాలు, అపార్ట్మెంట్లు, విద్యాసంస్థలు, ఫంక్షన్ హాళ్లు నిర్మించారని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రస్తుతం అక్కడ జరుగుతున్న అపార్ట్మెంట్లు, భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలి. అక్రమ కట్టడాలను కూల్చివేసి, మేలకుంట చెరువును, ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు.

## ఠాణాను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మల్యాల పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా ఆరా తీశారు.

## ఆహార కల్తీ అరికట్టడానికి కృషి చేయాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** తెలంగాణ రాష్ట్రంలో ఆహార కల్తీ అరికట్టడానికి కృషి చేయాలని దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ కోరారు. జగిత్యాలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు, వినియోగదారుల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వినియోగదారుల్లో చైతన్యం లేని కారణంగా నిరంతరం ఆహార కల్తీ విచ్చలవిడిగా పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార కల్తీ చట్టాలు ఆయా చట్టాలకు రోజురోజుకు జరిగిన సవరణలు పట్ల వినియోగదారుల ప్రతినిధులు అధికారులతో కలిసి ముమ్మరంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఖలీల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లా ఇన్స్పెక్టర్లు, సిరిసిల్ల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష, జగిత్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష, అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

**కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల జిల్లాలో చివరి దశ ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. బీర్పూర్ మండల కేంద్రం, నరసింహుల పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని సూచించారు. జగిత్యాల ఆర్.డి.వో మధుసూదన్, తహసిల్దార్, ఎంపిడివో, ఎంపివో, సివిల్ సప్లై అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదాం

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ కోర్ సంయుక్తంగా నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## రెండు లారీలు ఢీ - డ్రైవర్ సజీవ దహనం


**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా మేడిపల్లి దీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం ఉదయం రెండు లారీలు ఢీ కొన్న ఘటనలో ఒక లారీతో పాటు డ్రైవర్ సజీవ దహనం అయ్యారు. వివరాలిలా ఉన్నాయి. నాగ్ పూర్ నుంచి ఆలుగడ్డల లోడ్ తో హైదరాబాద్ వెళుతున్న లారీ టైర్ పంచర్ కావటంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచారు. అదే సమయంలో జొన్నల లోడ్ తో హైదరాబాద్ వెళుతున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ క్రమంలో జొన్నల లోడ్ లారీ కి మంటలు అంటుకున్నాయి. దీంతో లారీ డ్రైవర్ బయటకు రాలేక సజీవ దహనం అయ్యాడు. మృతుడు ఆదిలాబాద్ జిల్లా సోనాల మండలానికి చెందిన జవారి సింగ్ గా గుర్తించారు.

## మన బడి - మన బాధ్యత

**ముద్ర, కోరుట్ల:** పాఠశాలలు ఈ నెల 15న ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ 12 ఏళ్ల సేవా స్ఫూర్తితో కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు 'మన బడి – మన బాధ్యత' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ బడులను 13న శుభ్రం చేయాలని మండల అధ్యక్షులు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు.

# ఒకేసారి 2 వేల స్కూళ్లలో "టిఫిన్ బైఠక్'లు

**చిగురుమామిడి మండలం రేకొండలో టిఫిన్ బైఠక్ కు హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్**
**13న అన్ని స్కూళ్లలో "స్వచ్ఛ పాఠశాల" పేరుతో క్లీనింగ్**
**ఊరూవాడా కదలిరావాలంటూ కేంద్ర మంత్రి పిలుపు**




**ముద్ర, కరీంనగర్ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించనున్న ''స్వచ్ఛ పాఠశాల'' కార్యక్రమానికి భారీ స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని దాదాపు 2 వేల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకేసారి ''టిఫిన్ బైఠక్'' సమావేశాలు నిర్వహించనున్నారు.ఆయా గ్రామాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ పార్టీల కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా పాల్గొని పాఠశాలల పరిశుభ్రత కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించనున్నారు. ప్రతి పాఠశాలలో తరగతి గదుల సంఖ్య, వాటి శుభ్రతకు అవసరమైన స్వచ్ఛంద సేవకుల బాధ్యతలపై చర్చించి పనులను విభజించనున్నారు. ఈనెల 13న పాల్గొనేవారు స్వయంగా చీపురు, బకెట్, క్లాత్ తదితర సామగ్రిని తీసుకువచ్చి తరగతి గదులను శుభ్రం చేయనున్నారు.మంత్రి బండి సంజయ్ కుమార్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం రేగొండ పాఠశాలలో జరిగే టిఫిన్ బైఠక్‌లో పాల్గొననున్నారు. అక్కడ స్థానికులతో కలిసి అల్పాహారం చేస్తూ పరిశుభ్రత కార్యక్రమంపై చర్చించనున్నారు. అనంతరం 13వ తేదీన స్వయంగా ఒక తరగతి గదిని ఎంపిక చేసుకుని శుభ్రం చేయనున్నట్లు తెలిపారు.''బడి మనది.. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో భాగస్వాములు కావాలి'' అని బండి సంజయ్ పిలుపునిచ్చారు.ఇదిలా ఉండగా, జమ్మికుంట పర్యటనలో భాగంగా శిశు మందిర్ పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రతినిధులు, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులతో బండి సంజయ్ సమావేశమయ్యారు. మోదీ పాలనలో ఆరోగ్య రంగంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని వైద్యులను కోరారు. అనంతరం ప్రముఖులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మోదీ పాలన 12 ఏళ్ల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో ఐఎంఏ హుజూరాబాద్ జమ్మికుంట ప్రెసిడెంట్ డాక్టర్ కె.తిరుపతి, ఎథిక్స్ ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ బి.రమేశ్, పి.శ్రీకాంత్, కె.దేవేందర్ రెడ్డి, మురళీ, ప్రవీణ్, సంపత్, సాయి, కిశోర్, ఆకుల శ్రీనివాస్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జమ్మికుంటలోని పాకాల రవీందర్ రెడ్డి నివాసంలో పలువురు ప్రముఖులను కలిశారు. నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మోదీ పాలన విజయాలను, చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై ముద్రించిన పుస్తకాలను వారికి స్వయంగా అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, స్థానిక బీజేపీ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### కరీంనగర్ కలెక్టరేట్ భవనం

# ఈ నెలాఖరులో సీఎం చేతుల మీదుగా ప్రారంభం

**మున్సిపల్, శాతవాహన విశ్వవిద్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం**
**కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతాం**
**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నూతన కలెక్టరేట్ భవనాన్ని ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మున్సిపల్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శాతవాహన విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించిన మంత్రి, వివిధ విభాగాలను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నూతన కలెక్టరేట్ జిల్లా పరిపాలనకు కేంద్ర బిందువుగా మారి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించనున్నదన్నారు.గతంలో ప్రారంభమైన నిర్మాణ పనులు వివిధ కారణాలతో నిలిచిపోయాయని, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రత్యేక చొరవతో మిగిలిన పనులు వేగంగా పూర్తి అయ్యాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక వసతులు, ప్రజలకు అనుకూలమైన సేవా వ్యవస్థతో కలెక్టరేట్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని పేర్కొన్నారు.కలెక్టరేట్ ప్రారంభం తర్వాత పలు ప్రభుత్వ కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తీసుకువచ్చి ప్రజలకు సులభంగా సేవలు అందించేలా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. సుడా ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరిసరాల్లో విస్తృత స్థాయిలో గ్రీనరీ, ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణహిత వాతావరణం, విశాలమైన కార్యాలయాలతో ఈ భవనం రాష్ట్రంలోనే ఆదర్శ ప్రభుత్వ కార్యాలయ సముదాయంగా నిలుస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంలో నూతన కలెక్టరేట్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కరీంనగర్‌ను రాజకీయాలకు అతీతంగా పరిశ్రమలు, పర్యాటకం, విద్య, వైద్య రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.శాతవాహన విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, లా కాలేజీ, ఫార్మసీ కాలేజీల ఏర్పాటుతో ఉన్నత విద్యా అవకాశాలు విస్తరించాయని తెలిపారు. అలాగే కరీంనగర్‌ను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా మెడికల్ కాలేజీని టీచింగ్ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించారు. మానేరు రివర్‌ఫ్రంట్ రెండో దశ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, డంప్ యార్డు తరలింపునకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరినట్లు తెలిపారు. జిల్లాలో చేపడుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగానే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, ఆర్డీవో షర్మిల, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బడి బాట కరపత్రం ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ముద్ర, కోరుట్ల;** బడి బాట కార్యక్రమంలో భాగంగా కోరుట్ల కల్లూరు రోడ్ లోని క్యాంప్ గడి పాఠశాలలో రూపొందించిన ప్రచార కరపత్రాన్ని గురువారం రోజు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్ క్యాంప్ ఆఫీస్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడి పాఠశాలలో విద్యార్థుల నమోదు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన టాయిలెట్లు, మూత్రశాలలు, అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల విద్యాధికారులు నరేశం, మధు, దామోదర్ రెడ్డి, కనకతార, ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**మహాదేవపూర్, ముద్ర:** గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.గురువారం ఐడిఓసి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ వైద్య సంస్థలు నమోదు ప్రక్రియను పూర్తి చేసి, చట్టపరమైన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, ఐఎంఏ అధ్యక్షులు డా. కె.ఎస్. కిరణ్, మాలి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సదానందం, డిప్యూటీ వైద్యాధికారి డా. శ్రీదేవి, డెమో శ్రీదేవి పాల్గొన్నారు.

**భూ సమస్యలు పరిష్కరించండి**


జిల్లాలో బల్క్ భూములు, సాదా బైనామా మరియు రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి రెవెన్యూ అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు బల్క్ భూముల సర్వే జరుగుతున్నదని తెలిపారు. విద్యా సంస్థలు ప్రారంభం అవుతున్నందున ఆలస్యానికి తావు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనం కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంతకుమారి, భూపాలపల్లి కాటారం డివిజన్ ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, తహసిల్దార్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్, బహదూర్ఖాన్ పేట్ లో సుడా నిధులతో పలు అభివృద్ధి పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ముగ్దుంపూర్ మెయిన్ రోడ్డు ఆనుకొని 5 లక్షలతో డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బహదూర్ఖాన్ పేట్ లో 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజల కోరిక మేరకు అవసరమైన చోట అభివృద్ధికి నిరంతరంగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాబోయే రోజుల్లో ఇంకా అనేక అభివృద్ధి పనులు చేపడుతామని అన్నారు.ఈ కార్యక్రమాలలో శ్రీగిరి రంగారావు,బహద్దూర్ఖాన్ పేట్ సర్పంచ్ గుర్రం తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, వార్డ్ మెంబర్ తప్పట్ల అంజయ్య, మరియు దుబ్బపల్లి సర్పంచ్ మోతే ప్రశాంత్ రెడ్డి,చామనపల్లి సర్పంచ్ బోగొండ అయిలయ్య, చర్లబుత్కూర్ సర్పంచ్ కూర నరేష్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్రం అంజిరెడ్డి,పంచాయతీ కార్యదర్శి మహేందర్, మొగ్దుంపూర్ గ్రామ వార్డ్ మెంబర్ మల్లారెడ్డి,సిరిగిరి రంగారావు,శ్రీనివాస్ రెడ్డి,రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు

## రోడ్ల ఆక్రమణలను తొలగించాలి




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రోడ్ల ఆక్రమణలను తొలగించడంతో పాటు తోపుడు బండ్ల వారికి అవకాశము కల్పించాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ సత్య ప్రణవ్ ను కలిసిన ఎమ్మెల్యే జగిత్యాల పట్టణంలో యవర్ రోడ్డు వెడల్పు, రోడ్డు ఆక్రమణల తొలగింపు, ఇతర అభివృద్ధి పనుల పై వినతిపత్రం అందజేసీ మాట్లాడుతూ జగిత్యాల పట్టణములో వివిధ ప్రదేశాలలో వ్యాపారులు రోడ్లు ఆక్రమించి పర్మనెంట్ షెడ్డు వేసుకుని ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తూ వ్యాపారము చేస్తున్న వాటిని తొలగించి, తోపుడు బండ్ల వారు మాత్రము వ్యాపారము చేసుకునే అవకాశము కల్పించాలని కోరారు. జగిత్యాలలో బీట్ చౌరస్తా లో నిర్మించిన సమీకృత వేజ్ నాన్ వెజ్ మార్కెట్ లో మటన్, చికెన్, ఫిష్, పూలు, పండ్లు, కూరగాయలు పెట్టుకుని మార్కెట్ సక్రమముగా నడిచే విధంగా త్వరిత గతిన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ అఖిల్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 12.06.2026
www.mudranews.in | @mudranews



**మేధో సామర్థ్యానికి..**



కండరాలకు పని చెప్పండి. శారీరక శ్రమ ద్వారా కండరాల నుండి విడుదలయ్యే ఎక్సర్‌కైన్లు నేరుగా మెదడు రక్షణ పొరను దాటుకుని లోపలికి ప్రవేశిస్తాయి. ఇవి మేధో సామర్థ్యాన్ని పెంచడంలో మరియు మెదడు పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

## కళ్యాణ లక్ష్మి పేదలకు వరం

**ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**ముద్ర, యాదగిరిగుట్ట :** కళ్యాణ లక్ష్మి పేదలకు వరమని ప్రభుత్వవిప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం ఆలేరు నియోజకవర్గం పరిధిలోని 8 మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులను కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలలో కళ్యాణ లక్ష్మి ఒక ముఖ్యమైన పథకమని తెలిపారు. ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కుమార్తెల వివాహ సమయంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పిస్తున్నదని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సోని విజన్ షాపులో ఫోన్ల చోరీ



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నగరంలోని ప్రముఖ విక్రయ కేంద్రమైన 'సోని విజన్' షోరూమ్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు షాపు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, స్టాక్ రూమ్‌లో భద్రపరిచిన సుమారు 60 లక్షల విలువైన అధునాతన మొబైల్ ఫోన్లు చోరీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మారుతి ఎర్టిగా కారులో వచ్చిన ముగ్గురు దుండగులు షాపులోకి చొరబడి సెల్ ఫోన్లు చోరీ చెసి పరారి అయినట్లు పోలీసులు గుర్తించారు. సి సి టీవి పుటేజి పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. షాపు పరిసర ప్రాంతాలలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను కూడా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసు కమీషనర్ సునీల్ దత్ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు అధికారులకు పలు సూచనలు చేసారు.

### ప్రైవేట్ విద్యాసంస్థల

## అక్రమ ఫీజులపై చర్యలు తీసుకోవాలి

**అదనపు కలెక్టర్, డీఈఓ లకు వినతి పత్రం**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సూపర్ మార్కెట్ లా ప్రైవేట్ విద్యాసంస్థలు, అక్రమ ఫీజుల వసూళ్లు, విద్యాహక్కు చట్టం ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిర్యాల శ్రీనివాస్ అదనపు కలెక్టర్ భాస్కరరావు, డీఈవో లకు గురువారం వేరువేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని అన్నారు. పుస్తకాలు, యూనిఫార్మ్‌లు, షూస్, బ్యాగులు, ఇతర విద్యాసామగ్రి పేరుతో ఇష్టానుసారంగా అధిక ధరలు నిర్ణయించి, మార్కెట్ ధరలకు మించి భారీగా వారి ఇష్టనుసారంగా వారు ముద్రించిన ధరలకు ఎక్కువ ధరలు విధిస్తూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యాహక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి పేద మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గుజ్జ పవన్, బానోతు శ్రవణ్ నాయక్, దాసరి చరణ్, బానోతు ఆకాష్ నాయక్, గణేష్, మల్లేష్, నాని, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వామివారికి లక్ష పుష్పార్చన

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో బుధవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని స్వామి అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ఆలయ అర్చకులు వైభవంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వామి అమ్మవార్లను బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి వివిధ రంగురంగు పూలతో స్వామి అమ్మవార్లకు లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యులు, వెంకన్నచార్యులు, మురళి చార్యులు, అనిల్ కుమార్ చార్యులు, ప్రశాంత్ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

– ముద్ర, యాదగిరిగుట్ట



## విజేత సూపర్ మార్కెట్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం మమత రోడ్ లో విజేత సూపర్ మార్కెట్ నువ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. 1999 లో సూపర్ మార్కెట్ రంగంలో మొదటి బ్రాంచ్ స్థాపించి, నేడు "విజేత సూపర్ మార్కెట్ " ఒక బ్రాండుగా నిలిచిందని తుమ్మల కొనియాడారు. 27సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వినియోగ దారులకి, నిత్యావసర వస్తువులతో అత్యున్నతమైన నాణ్యమైన సేవలు అందించిన విజేత ఇప్పుడు మన ఖమ్మం లో 117వ శాఖ ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు ఈ అవకాశాన్ని కస్టమర్లు వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.విజేత సూపర్ మార్కెట్స్ ఛైర్మెన్ మురకొండ జగన్మోహన్ రావు మాట్లాడుతూ తమను నమ్మిన మా కస్టమర్ లకు, ఖాతాదారులకు, అండగా నిలిచినా డిస్ట్రిబ్యూటర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు. విజేతలుగా మా ప్రయాణం లో నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన నా కుటుంబ సభ్యులకు, ఉద్యోగ సహచరులకు ప్రత్యేక ధన్యవాదములుతెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో మార్ట్ విస్తరిస్తామని, కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందిస్తామని జగన్ మోహన్ రావు అన్నారు. ఈ సహకారం ఎప్పటికి కోరుతూ, మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అండగా ఉండాలని విజేత సూపర్ మార్కెట్ ఛైర్మన్ కోరారు, కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి, రాజ్యలక్ష్మి,మార్కెటింగ్ డైరెక్టర్ సిధార్థ, సిబ్బంది పాల్గొన్నారు




## వైభవంగా కళ్యాణం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో గురువారం ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు నవ కలుశ పంచామృత అభిషేకాన్ని, తిరుప్పావడ సేవ నిర్వహించారు. 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ తదితర పిండి వంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారు. శ్రీస్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి శ్రీ స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

## సవరణ పేరుతో హక్కులకు భంగం కలిగించే చర్యలు అంగీకరించం

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**

**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** సర్ పేరుతో ఓటర్ల హక్కులను హరించవద్దని ఎం ఎల్ సి బల్మూరి వెంకట్,సీనియర్ నాయకులు కత్తి వెంకటస్వామి అన్నారు. గురువారం పట్టణంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్ లో బూత్ లెవల్ ఏజెంట్ల కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ వలన పేదలు, కార్మికులు, గ్రామీణ ప్రాంత ప్రజలు అవసరమైన పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. అయితే వారి ఓటు హక్కులను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ కు ఉందన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, అంతటి గొప్ప ఆయుధాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ హరించరాన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే చర్యలు అంగీకరించబోమని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కాంగ్రెస్ పార్టీ సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తుందని. ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తుందన్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు,ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,టిపిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు,కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి జానయ్య, నాయకులు తండు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పొగాకు నియంత్రణ చర్యలు సమర్థవంతంగా అమలు చేయాలి

**యాదాద్రి భువనగిరి కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** జిల్లాలో పొగాకు నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31న నిర్వహించే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన, అమలు, తనిఖీ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోలీస్, మున్సిపల్, విద్య, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రజా ప్రదేశాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, విద్యాసంస్థల పరిసరాల్లో చట్ట ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాను పూర్తిస్థాయిలో పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ జిల్లాలో పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ర్యాలీలు, వాక్‌థాన్‌లు, ఐఈసీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి ఎం. మనోహర్, జిల్లా అగ్నిమాపక అధికారి మధుసూదన్ రావు, డా. వీణ, ఐ. పద్మ, జి. ఇస్తారి, జిల్లాలోని అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత అమలు, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులు, సెర్ప్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, మొదటి విడత నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఇప్పటి వరకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, అట్టి స్థానంలో ఇళ్లు మంజూరు కాని కొత్త లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులను అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, లబ్ధిదారులకు సకాలంలో డబ్బులు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం పనులను సమర్థవంతంగా అమలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గుడిసెలను గుర్తించి వెంటనే అట్టి నివేదికను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పిడి హౌసింగ్ అలివేలు, పంచాయతీరాజ్ అధికారి దాసయ్య, అడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్, ఎంపీడీవోలు, ఏ.ఈ లు, ఏపీఎంలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 12.06.2026
www.mudranews.in | @mudranews



## మేధో సామర్థ్యానికి హిప్పోక్యాంపస్‌ను ఉత్తేజితం చేయండి

నిరంతర వ్యాయామం వల్ల జ్ఞాపకాలు భద్రంగా ఉండే మెదడు లోని 'హిప్పోక్యాంపస్' భాగంలో కొత్త నాడీ కణాలు ఏర్పడతాయి. శరీరంలోని వివిధ అవయవాల సమన్వయ ప్రతిస్పందన ద్వారానే మెదడుకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది.






## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

### - ఎస్పీ శ్రీనివాస రావు

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాలో నమోదవుతున్న వివిధ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నెలవారి క్రైమ్ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, మిస్సింగ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ అమలు చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యంతో చేపట్టి, అదృశ్యమైన వారి ఆచూకీ త్వరితగతిన గుర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావు లేకుండా చట్టపరమైన గడువుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలని పేర్కొన్నారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ డేటాను తప్పనిసరిగా నవీకరించాలని, మాన్యువల్ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నమోదుల మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు సకాలంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రానున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఎక్కువ సంఖ్యలో కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

ఈ సమావేశంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐలు రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి, సందీప్ రెడ్డి, రంగా కృష్ణ, సైదా, మహేష్, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## హుస్నాబాద్ బస్ స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

### - మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు..

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట: హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో వర్షాకాలంలో ఏర్పడుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి హుస్నాబాద్ బస్ స్టేషన్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లోని ప్రయాణికులతో నేరుగా మాట్లాడిన మంత్రి, బస్సుల రాకపోకలు, మౌలిక సదుపాయాలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల సమయంలో వరద ప్రభావంతో బస్ స్టేషన్‌లో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. బస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న నాలాను ప్రధాన డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానం చేసేలా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీర్లు, ఆర్టీసీ అధికారులకు మంత్రి ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చేసి ప్రయాణికులకు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ ప్రజలు వర్షాకాలంలో బస్ స్టేషన్ సమస్యలపై తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆర్టీసీ ఎండీ, అధికారులతో కలిసి పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. రోజుకు సుమారు 35 వేల మంది ప్రయాణికులు ఈ బస్ స్టేషన్‌ను వినియోగిస్తున్నారని, రెవెన్యూ పరంగా రాష్ట్రంలో ప్రముఖ బస్ స్టేషన్లలో ఇది ఒకటని చెప్పారు. పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు, పర్యాటక రంగం, మెడికల్ కళాశాలలు, పారిశ్రామిక కారిడార్ అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాధాన్యం మరింత పెరుగుతోందన్నారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లేన్ రహదారులతో అనుసంధానం కలిగిన హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

#### పుష్కరాలకు ప్రత్యేక బస్సులు..

2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారాలతో అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి తెలిపారు. ప్రజాధనం వృథా కాకుండా సమర్థవంతమైన ప్రణాళికలతో పనులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ, హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో ప్రధాన సమస్య వర్షాకాలంలో నీరు చేరడమేనని అన్నారు. మంత్రి సూచనల మేరకు సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఖాళీ స్థలాలు, వ్యాపార వర్గాల సహకారం లభిస్తే బస్ స్టేషన్‌ను ఆధునీకరించి, పెద్ద షాపింగ్ మాల్‌ను తలపించే విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రెవెన్యూ పరంగా అత్యధిక ఆదాయం వచ్చే ఏ-క్లాస్ కమర్షియల్ బస్ స్టేషన్లలో హుస్నాబాద్ ఒకటని పేర్కొన్న ఆయన, రోజుకు 35 వేల మందికి పైగా ప్రయాణికులు ఈ కేంద్రాన్ని వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు బస్ స్టేషన్‌ను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తరి పద్మ, కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## నాడు ఓటు చోరీ.. నేడు సీటు చోరీ



### - బీజేపీపై ఎమ్మెల్యే రోహిత్ రావు విమర్శలు

ముద్ర ప్రతినిధి, మెదక్: దేశంలో ప్రజాస్వామ్య విలువలను దెబ్బ తీసే విధంగా బీజేపీ వ్యవహరిస్తోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు ఆరోపించారు. గురువారం మెదక్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఓటరు జాబితా అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారాన్ని కాపాడుకోవడం కోసం బీజేపీ ఎన్నో కుట్రలకు పాల్పడుతోందని, గతంలో ఓట్లను చోరీ చేసిన పార్టీ నేడు ప్రజలు ఎన్నుకున్న సీట్లను కూడా చోరీ చేసే స్థాయికి దిగజారిందని విమర్శించారు. ప్రజల తీర్పును గౌరవించకుండా రాజకీయ లబ్ధి కోసం ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఎన్నికల్లో ఓటర్లను తప్పుదోవ పట్టించడం, అనంతరం ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురిచేయడం బీజేపీ రాజకీయ వ్యూహంగా మారిందని ఆరోపించారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను బలహీనపరిచేందుకు కేంద్ర సంస్థలను ఉపయోగిస్తున్నారని విమర్శించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ, ఓటు హక్కును దెబ్బతీసే విధంగా బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఓటర్ల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పనిచేస్తోందని చెప్పారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలకు ఇప్పటి నుంచే కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని, కొత్త ఓట్ల నమోదుతో పాటు నకిలీ ఓట్ల తొలగింపుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరుశరామ్ గౌడ్, మున్సిపాల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ హరిత, తాహెర్, బొజ్జ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే రోహిత్

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ పట్టణం 18వ వార్డులో ఇందిరమ్మ ఇంటిని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. 20, 21 వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారంగా కొత్త బోర్లను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రోహిత్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్, కౌన్సిలర్లు, మన్సురు, శశాంక్, తాహేర్, గౌస్ ఖురేషి, మాజీ మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్ నాయకులు భూపతి రాజ్ బొజ్జ పవన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



## మెదక్ ఖిల్లాకు దేశస్థాయిలో గుర్తింపు తేవాలి





### - కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ చారిత్రాత్మక ఖిల్లాకు దేశ స్థాయిలో గుర్తింపు తేవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్ సహకారంతో మెదక్ ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రాష్ట్ర, దేశ స్థాయిలో ముందుంచుతామని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు..

ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీఓ రమాదేవి,,ఇతర అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కమిషనర్ నవీన్ తో మెదక్ ఖిల్లాను సందర్శించారు. ఖిల్లాపైన అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల మొక్కలను, ముళ్ల పొదలను తొలగించారు. మెదక్ ఖిల్లాపైన ఉన్న గజశాల, దర్వాజాలు, జైలును తదితర చారిత్రక అంశాలను కలెక్టర్ ప్రతిమ సింగ్ అడిగి తెలుసుకున్నారు. మెదక్ ఖిల్లాపైన ఎక్కడ డ్యామేజ్ అయింది. ఎక్కడ శిథిలావస్థకు చేరిందనే అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. మెదక్ జిల్లాలో దొరికిన పురావస్తు విగ్రహాలు, తదితర శాసనాలు, వివిధ అంశాలతో మెదక్ ఖిల్లపై మ్యూజియంను ఏర్పాటు చేసి మెదక్ జిల్లా చరిత్రను చెప్పే విధంగా పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామన్నారు.జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం కింద నిధులు తీసుకొచ్చి మెదక్ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మెదక్ ఖిల్లాపై లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోవు రోజుల్లో ఖిల్లాపై సాంస్కృతిక కార్యక్రమాలు చేయడానికి అనువైన ప్రదేశం అని కొనియాడారు. మెదక్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరగా ఉన్నటువంటి నేపథ్యంలో జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

#### సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

శివంపేట మండల కేంద్రంలోని ఉసిరికపల్లి గ్రామంలో పోతరాజుల బాలేష్ అనే రైతు తన నాలుగున్నర ఎకరాల పొలంలో సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పంటలను, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులు సాగు చేస్తున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న వరి, కూరగాయలు, పండ్ల తోటలు, ఇతర పంటలను పరిశీలించి రైతుతో మాట్లాడారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించడంలో సేంద్రియ వ్యవసాయం కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, సాంకేతిక వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారిణి సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

## అందె గ్రామానికి రోడ్డు వేయించాలి

### - మంత్రి వివేక్ ను కలిసి వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట (మిరుదొడ్డి): మిరుదొడ్డి మండలంలోని మారుమూల ప్రాంతమైన అందె గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

భూంపల్లి-అక్బర్‌పేటలోని రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రిని కలిసిన గ్రామస్తులు, గత ఎనిమిది నెలలుగా రోడ్డు మరమ్మతుల పేరుతో కంకర పరచి పనులను మధ్యలోనే నిలిపివేశారని వివరించారు. బీటీ రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందని కాంట్రాక్టర్‌తో పాటు ఆర్ అండ్ బీ అధికారులను అడిగితే డాంబర్ ధరలు పెరిగాయని సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంకర రోడ్డుపై ప్రయాణించే ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సుమారు 25 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారినా ఇప్పటివరకు సరైన మరమ్మతులు చేపట్టలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అందె గ్రామం నుంచి మిరుదొడ్డి మండల కేంద్రానికి, సిద్దిపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా విద్యార్థులు విద్యాభ్యాసానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వెంటనే బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని, మారుమూల గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అందె విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి అందె ప్రవీణ్, సాయిరెడ్డి,ఉప సర్పంచ్ పరశురాములు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.





## జిల్లా సేవలకు స్వాగతం.. డీఆర్వో పాండుకు సన్మానం

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: ఇటీవల బదిలీపై నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఆర్. పాండును తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్జీవో) జిల్లా నాయకులు గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో నాయకులు ఆర్. పాండుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందిస్తూ విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల సంఘం తరఫున జిల్లాకు స్వాగతం పలుకుతూ ఆయనతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల విషయంలో ఉద్యోగులు ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని టీఎన్జీవో నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, పరిపాలనా వ్యవస్థ బలోపేతానికి కలిసి పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బావండ్ల వెంకటేష్, కోశాధికారి బాలరాజు, ఉపాధ్యక్షులు కోట్ర బాలాజీ, చెన్నకేశవులు, యూనిట్ అధ్యక్షుడు నసిరుద్దీన్, కార్యదర్శి మలిపెద్ది సురేష్ కుమార్, నాయకులు కళ్యాణ్ కృష్ణారావు, లింగం, రమేష్, ఎం. ఆనంద్, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపూర్ లో 60 గొర్రెలు మృతి

ముద్ర, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో కందూరి సాయిలకు చెందిన మందలో నుంచి 60 గొర్రెలు గురువారం మృతి చెందాయి. తొలి రోజు 10 గొర్రెలు మృతి చెందగా.. మరుసటి రోజు ఒకే మందలోని 60 గొర్రెలు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ విషయం తెలిసి, పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతి చెందిన ఒక గొర్రెను నిజామాబాదులోని అదనపు పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపించారు. చివరి నిర్ధారణ కోసం హైదరాబాద్ ఫోరెన్సిక్ విశ్లేషణకు నమూనాలను పంపించారు. విష ఆహారం వల్లనే గొర్రెలు మృతి చెందినట్లు అధికారులు భావిస్తున్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No.6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu. Rockdale compound, Somajiguda, Hyderabad-500082 Editor Y Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email mudradailys@gmail.com